ప్రజాశక్తి
బుధవారం 26 జూన్ 2024
8 పేజీలు
విశాఖపట్నం
అనకాపల్లి





వాలంటీర్లపై బాబు పునరాలోచన

- కొనసాగింపుపై కూటమి ఎమ్మెల్యేలు అభ్యంతరం
- కొత్త మార్గదర్శకాలతో తొలగింపు యోచన
- పింఛన్ల పంపిణీ బాధ్యత తప్పింపుపై వాలంటీర్లలో ఆందోళన



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

వాలంటీర్లను కొనసాగించి, రూ.10 వేలకు వారి జీతం పెంచుతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో వాలంటీర్ల కొనసాగింపు, జీతం పెంపు విషయమై మాట్లాడలేదు సరికదా.. సచివాలయ ఉద్యోగులతో పింఛన్ సొమ్ము పంపిణీ చేయాలని నిర్ణయించారు. జులైలో ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము ఇచ్చే బాధ్యత నుంచి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్లను తప్పించింది. ఆ పనిని సచివాలయ ఉద్యోగులకు అప్పగించడంతో వాలంటీర్లు తమను కొనసాగిస్తారో, లేదోనని ఆందోళన చెందుతున్నారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ప్రభుత్వ కార్యక్రమాలు, పింఛన్ పంపిణీ బాధ్యతలో వాలంటీర్లు పాల్గొనరాదని ఎన్నికల కమిషన్ పేర్కొంది. అప్పటి నుంచి సచివాలయాలకు వెళ్లి హాజరు వేసుకొని రావడం తప్ప ప్రభుత్వ కార్యకలాపాలకు వాలంటీర్లు దూరంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినా వారిని కొనసాగించే విషయమై స్పష్టత ఇవ్వకపోవడంతో ప్రస్తుతానికి హాజరు నమోదు చేసుకున్న వారికి జీతాలు చెల్లిస్తున్నారు.

జిల్లాలో 522 సచివాలయాల పరిధిలో 9,132 మంది వాలంటీర్లను గత ప్రభుత్వం నియమించింది. వీరిలో సార్వత్రిక ఎన్నికల ముందు 5002 మంది రాజీనామా చేయడంతో ప్రస్తుతం 4,130 మంది వాలంటీర్లు కొనసాగుతున్నారు. రాజీనామా చేసిన వారికి జీతాలు ఆపేశారు. రాజీనామా చేసిన వాలంటీర్లు మళ్లీ తమను పునరుద్ధరించాలని కోరుతున్నా తీసుకొనే పరిస్థితి కానరావడం లేదు. ఎన్నికల ముందు వాలంటీర్ల జీతం రెట్టింపుచేసి, కొనసాగిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినా అందుకు కూటమి ఎమ్మెల్యేలు అంగీకరించడంలేదని తెలిసింది. గత ప్రభుత్వంలో నియామకమైన వాలంటీర్లు వైసిపికి చెందిన వారు కావడంతో వారందరినీ తొలగించి కొత్తగా తమ వారిని తీసుకోవాలని కూటమి ఎమ్మెల్యేలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. మంత్రులు కూడా ఎమ్మెల్యేల మిగతా 2లో..



నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ వద్ద ధర్నా చేపట్టిన సిపిఎం నాయకులు

రైళ్లను పునరుద్ధరించాలని

సిపిఎం ధర్నాలు

వార్త మెయిన్, టాబ్లాయిడ్ 5వ పేజీలో..

29న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 29న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరుగనున్నట్టు జెడ్‌పి ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం.పోలినాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు 2, 5 స్థాయీ సంఘాల సమావేశాలు, 11 గంటలకు 4, 3 స్థాయీ సంఘాల సమావేశాలు, మధ్యాహ్నం 12 గంటలకు 1, 6, 7 స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సకాలానికి సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

ఇగ్నోలో ఎంబిఎ కోర్సులు ప్రారంభం

వార్త 2లో..

'హయగ్రీవ' వ్యవహారంలో మాజీ ఎంపీ ఎంవివిపై కేసు

వార్త మెయిన్‌లో..

ప్రత్యేక రైళ్ల సేవలు కొనసాగింపు

వార్త 2లో..



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

నీట్‌పై ఎస్ఎఫ్ఐ నిరసన

అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ వార్త మెయిన్‌లో...

స్టాప్ డయేరియా స్పెషల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో స్టాప్ డయేరియా పేరిట ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. మంగళవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జివిఎంసి అదనపు కమిషనర్ (డెవలప్‌మెంట్) కెఎస్.విశ్వనాథన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి స్టాప్ డయేరియా క్యాంపెయిన్ - 2024 కార్యాచరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అతిసార వ్యాధి వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని భావించి అందుకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సిటీ ఆపరేషన్ సెంటర్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఆ కంట్రోల్ రూమ్ 24 గంటలూ పనిచేస్తుందని, నీరు కలుషితమైనా, కాలువలు, గెడ్డలు పొంగిపొరలినా, మలేరియా, డయేరియా, డెంగీ వ్యాధులు సోకినా వెంటనే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 0891-2869109కు మిగతా 2లో..

అగనంపూడి టోల్‌గేట్ వద్ద ఉద్రిక్తత

ఛార్జీల వసూలును అడ్డుకున్న టిడిపి నేతలు, స్థానికులు



టోల్‌గేట్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

ప్రజాశక్తి - ఉక్కునగరం : అగనంపూడి టోల్‌గేట్ వద్ద మంగళవారం సాయంత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యేగా తాను గెలుపొందితే నెల రోజుల్లోగా టోల్‌గేట్‌ను తొలగిస్తానని టిడిపి నేత పల్లా శ్రీనివాసరావు గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన గెలవడం, టిడిపి రాష్ట్ర అధ్యక్షునిగానూ పదవి చేపట్టడంతో ఆయన అనుచరులు మంగళవారం టోల్‌గేట్ పనులను నిలువరించారు. టోల్ ఛార్జీలు వసూలు చేయకుండా అడ్డుకున్నారు. సమీప కాలనీల ప్రజలూ వారికి తోడయ్యారు. ఈ నేపథ్యంలో అక్కడ టిడిపి నాయకులకు, నేషనల్ హైవే అథారిటీ యాజమాన్యానికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు టోల్‌గేట్ ఇన్‌ఛార్జి సతీష్‌తో మాట్లాడారు. ఆనందపురం హైవే ప్రారంభమైన తర్వాత కూడా ఇక్కడ టోల్‌ఛార్జీలు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. స్పష్టత ఇచ్చిన తర్వాతే టోల్ వసూళ్లు ప్రారంభించాలని తెలిపారు. అప్పటివరకూ టోల్‌గేటును కొనసాగించవద్దన్నారు. అలా కాదని చట్టవిరుద్ధంగా టోల్‌గేట్ కొనసాగిస్తే శాంతి భద్రతల సమస్య మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

వాలంటీర్లపై బాబు పునరాలోచన

సూచనలపై సానుకూలంగా స్పందించడంతో సోమవారం జరిగిన మంత్రివర్గంలో వాలంటీర్ల కొనసాగింపు అంశంపై నిర్ణయం ప్రకటించకుండా ప్రభుత్వం వాయిదా వేసింది.

వైసిపి ప్రభుత్వంలో నియమితులైన వాలంటీర్లను కొనసాగిస్తే.. తమ మాటకు విలువలేకుండా పోతుందని, అందుకని వాలంటీర్ల కొనసాగింపు విషయమై ఆలోచించాలని ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో చంద్రబాబు పునరాలోచనలోపడ్డారు. భవిష్యత్తులో ప్రస్తుతం పనిచేస్తున్న వాలంటీర్ల పనిపై కొన్ని మార్గదర్శకాలు రూపొందించి క్రమంగా తప్పించాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది.

అగనంపూడి టోల్‌గేట్ వద్ద ఉద్రిక్తత

వస్తుందని వెల్లడించారు. లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ఉన్నారు.

స్టాప్ డయేరియా
స్పెషల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజలు తెలియజేయవచ్చునన్నారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్ జులై 1 నుండి ఆగస్టు 31 వరకు రెండు నెలలు పాటు కొనసాగుతుందని తెలిపారు. ప్రతిరోజూ డయేరియా, మలేరియా, డెంగీ వ్యాధులపై నివేదిక సమర్పించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్‌ను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్.వర్మ, ప్రధాన ఇంజినీరు రవికృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజినీర్ కెవిఎన్.రవి, బయాలజిస్ట్ సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో వృక్ష పునరుజ్జీవ చర్యలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో వృక్ష పునరుజ్జీవ చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు కెజిహెచ్ పార్కింగ్ ఆవరణలో 25 అడుగుల ఎత్తు ఉన్న బాదం చెట్టు వేళ్లతో సహా నేలకొరగ్గా దాన్ని నరికివేయకుండా తిరిగి ఆ చెట్టు తన జీవితాన్ని కొనసాగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం చెట్టులో కొన్ని కొమ్మలను, మానులో కొంత భాగాన్ని తొలగించి వాటికి ఫంగల్ చికిత్స అందించారు. క్లైమేట్ ఫ్రంట్ అనే సంస్థ దీనికి సాయం అందించింది. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, కెజిహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిన్) సిహెచ్.శ్రీనివాస కుమార్, ఎంఆర్ఎంఒ డాక్టర్ ధవళ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఎయులో 11వ రోజుకు నిరసన దీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం వ్యవస్థీకృత మార్పులు అవసరమని హ్యూమన్ రైట్స్ ఫోరమ్ ప్రెసిడెండ్ శ్యాంప్రసాద్, ఆంధ్ర యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సూరప్పుడు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ విగ్రహం ఎదురుగా ఎయు విసి తీరును నిరసిస్తూ చేపట్టిన నిరసన దీక్ష మంగళవారానికి 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీలో మార్పులను టీచింగ్, నాన్ టీచింగ్‌లో కూడా చేయాలని అన్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, కన్సాలిడేటెడ్ పే ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర యూనివర్సిటీ ట్రస్ట్ ఫ్యాకల్టీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ మీనన్, డాక్టర్ పొన్నాడ శ్రీనివాసరావు, డాక్టర్ భాను, డాక్టర్ మంజులత, సన్‌మూర్తి, డాక్టర్ నాయుడు, సురేష్ ,జేమ్స్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి హయాంలో నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలన పోయి ప్రజా పాలన వచ్చిందని అన్నారు. ఉపాధ్యాయ విద్యకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. టిడిపి హయాంలో 11 డిఎస్‌సిలు తీశారన్నారు. జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులను అన్ని విధాలుగా మోసం చేశారని ఆరోపించారు. ఆయన పాలన సక్రమంగా జరగలేదని, అయినప్పటికీ వాస్తవాలను ఒప్పుకోవడం లేదని అన్నారు. చంద్రబాబు, జగన్ పాలనలకు మధ్య తేడాను ప్రజలు, నిరుద్యోగులు గమనిస్తున్నారని చెప్పారు. తొందరలో కూటమి ప్రభుత్వం నుంచి జాబ్ కేలండర్ వస్తుందన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, లీగల్ సెల్ అధ్యక్షులు డి.రాజశేఖర్ పాల్గొన్నారు.

శారదాపీఠానికి ఇచ్చిన భూమిని స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గత జగన్ ప్రభుత్వం విశాఖపట్నంలోని స్వరూపానంద స్వామికి చెందిన శారదా పీఠానికి అప్పనంగా కట్టబెట్టిన భూమిని ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు జె.రవి, రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సుమారు రూ.200 కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని కేవలం రూ.15 లక్షలకే పీఠానాకి అప్పనంగా ఇచ్చేసారని వారు తెలిపారు. సర్వసంగ పరిత్యాగులైన స్వాములకు అంత భూమి అవసరమా అని ప్రశ్నించారు. వేద పాఠశాల అని చెప్పి ఆ భూమిని ప్రభుత్వం వద్ద నుంచి తీసుకున్నారని, కానీ దానిని ఒక ఆదాయ వనరుగా సృష్టించుకునే ఆలోచనతో పీఠంవారు ఉన్నారని పేర్కొన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు మండలంలోని ఓ బాబా చేస్తున్న ఆశ్రమ కార్యకలాపాలపైనా, తిరుపతిలోని కల్కి అక్రమాలపైనా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు.

హయగ్రీవ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి



ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మూర్తియాదవ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎండాడ సర్వే నెంబరు 92/3లో హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ సంస్థ వారు సకాలంలో అనాథాశ్రమం, వయోవృద్ధాశ్రమం నిర్మించి వినియోగంలోకి తేవడంలో విఫలమై, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్నందున ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని, నిర్మాణ పనులు నిలిపివేసి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మంగళవారం సాయంత్రం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ మయూర్ అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ప్రముఖ భవన నిర్మాణాల వ్యాపార వేత్త, మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, జివి. వెంకటేశ్వరరావు, బ్రహ్మాజీలు హయగ్రీవ యాజమాన్యంపై రాజకీయ ఒత్తిడి తెచ్చి భవన నిర్మాణాల ఒప్పందం చేసుకుందామని ఖాళీ తెల్ల కాగితాలపై సంతకాలు తీసుకొని మోసం చేశారని ఆ భూమిని నాటి ప్రభుత్వం నుంచి తీసుకున్న జగదీశ్వరుడు ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వం వద్ద స్వల్ప ఖరీదుకు భూమి పొందినప్పటి నుంచి నేటి వరకు ప్రాజెక్టు పనులు పూర్తి స్థాయిలో చెయ్యకుండా అక్రమ వ్యాపార లావాదేవీలు జరిపినటువంటి హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ సంస్థ అన్నింటా విఫలమైందన్నారు. సుమారుగా రూ.500 కోట్లు విలువ చేసే భూముల్లో అక్రమ ఆర్థిక భూ లావాదేవీలు జరపడం, తదుపరి అంశాలను పరిగణనలోకి తీసుకుని హయగ్రీవ సంస్థకు కేటాయించిన భూమిని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని మూర్తి యాదవ్ కోరారు.

ఘనంగా గ్రంధి మనోజ్ కుమార్ జయంతి

పలు సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు



కార్యక్రమంలో పాల్గొన్న గ్రంధి మల్లికా రత్నకుమారి తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మనోజ్ వైభవ్ జెమ్స్ అండ్ జ్యూయలర్స్ లిమిటెడ్ (వైభవ్ జ్యూయలర్స్) వ్యవస్థాపక అధ్యక్షులు, కీర్తిశేషులు గ్రంధి మనోజ్ కుమార్ 58వ జయంతి కార్యక్రమాన్ని నగరంలో ఘనంగా నిర్వహించారు. ఆయన జ్ఞాపకార్థం సంస్థ ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ ఎమ్‌డి సుగంధి మాట్లాడుతూ మనోజ్ కుమార్ విశాఖపట్నంలోని అనేక మంది వ్యాపారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. అద్భుతమైన బంగారు ఆభరణాల డిజైన్లు, అత్యున్నత వినియోగదారీ సేవలతో మంచి పేరు సంపాదించారన్నారు. అనంతరం ఎఎస్.రాజా వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, హెల్త్ డొమైన్ (ఐ) ప్రైవేట్ లిమిటెడ్ అధ్వర్యంలో హెల్త్ క్యాంపు, మ్యాక్సి విజన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఐ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో వైభవ్ జ్యూయలర్స్ ఛైర్‌పర్సన్ భారత మల్లికా రత్నకుమారి గ్రంధి, సంస్థ హోల్‌టైమ్ డైరెక్టర్ అండ్ సిఎస్ఒ సాయి కీర్తన, సిఒఒ రఖాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరీ, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, వైభవ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఇగ్నోలో ఎంబిఎ కోర్సులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జులై - 2024 విద్యాసంవత్సరానికిగానూ వివిధ దూరవిద్యా కోర్సులతో పాటు కొత్తగా నాలుగు ఎంబిఎ కోర్సులను ప్రారంభించిందని వర్సిటీ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. వైద్య ఆరోగ్య రంగాలతో పాటు నిర్వహణా రంగాలలో పనిచేస్తున్న వారికోసం ఎంబిఎ - హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, వ్యవసాయాన్ని, వ్యవసాయాధారిత పరిశ్రమలను లాభసాటిగా మార్చేందుకు, ప్రజలకు మరింత చేరువచేసేందుకు కావలసిన నైపుణ్యాలను అందించేందుకు ఎంబిఎ - అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. అంతేకాకుండా ఇంజినీరింగ్ రంగాల్లో ఉపాధి కోరుకునేవారికి ఎంబిఎ - కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ కోర్సులను అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. ఆ కోర్సులన్నీ ఇప్పుడు కొనసాగుతున్న జులై 2024 అడ్మిషన్లలో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. చేరదలిచినవారు అడ్మిషన్ల లింకు https://ignouadmission.samarth.edu.inతో మరింత సమాచారాన్ని పొందవచ్చునని తెలిపారు ఇగ్నో అధ్యయన కేంద్రాలనుగానీ, ప్రాంతీయ కేంద్రాన్నిగానీ, 0891-2511200 నెంబరునుగానీ సంప్రదిస్తే మరింత లోతైన సమాచారం లభిస్తుందని తెలిపారు.

పద్మ అవార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్ వారు 2025 జనవరి 26 భారత రిపబ్లిక్ డేను పురస్కరించుకుని ఇచ్చే పద్మ అవార్డుల పురస్కారం కోసం ఆర్ట్, సోషల్ వర్క్స్, పబ్లిక్ ఎఫైర్స్, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీసు, స్పోర్ట్సు మొదలగు రంగాలలో అత్యుత్తమ సేవలను అందించిన విశిష్ట ప్రతిభావంతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సెట్విస్ అధికారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ పద్ధతిన మాత్రమే నిర్ణీత నమూనాలో, వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలక్లు ముఖ్యకార్యనిర్వాహణ అధికారి, సెట్విస్, మహారాణిపేట అడ్రస్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక రైళ్ల సేవలు కొనసాగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని.. అదనపు రద్దీని నియంత్రించే క్రమంలో హౌరా - యశ్వంత్‌పూర్ - హౌరా, సంత్రాగచ్చి - ఎస్ఎంవి బెంగళూరు - సంత్రాగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో 02863 హౌరా - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు జులై 4 నుంచి 25 వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 12.40 గంటలకు హౌరా నుంచి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 2.43 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 02.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి 00.15 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది. 02864 యశ్వంత్‌పూర్ - హౌరా ప్రత్యేక రైలు జులై 6 నుంచి 27 వరకు ప్రతి శనివారం ఉదయం 5.00 గంటలకు యశ్వంత్‌పూర్ నుంచి బయలుదేరి అదేరోజు రాత్రి 23.05 గంటలకు దువ్వాడకు చేరుకుని మరలా 23.07 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 13.25 గంటలకు హౌరా చేరుకుంటుంది. ఈ రైళ్లు ధర్మవరం, అనంతపురం, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తాయి. 08845 సంత్రాగచ్చి - ఎస్ఎంవి బెంగళూరు ప్రత్యేక రైలు జులై 5 నుంచి 26 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 19.00 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.00 గంటలకు దువ్వాడకు చేరుకుని 9.02 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 2.00 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు చేరుకుంటుంది. 08846 ఎస్ఎంవి బెంగళూరు - సంత్రాగచ్చి ప్రత్యేక రైలు జులై 7 నుంచి 28 వరకు ప్రతి ఆదివారం ఉదయం 3.15 గంటలకు ఎస్ఎంవి బెంగళూరులో బయలుదేరి అదేరోజు రాత్రి 20.55 గంటలకు దువ్వాడకు చేరుకుని మరలా 20.57 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.45 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. ఈ రైళ్లు ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, కటక్, భువనేశ్వర్, ఖుర్దా రోడ్, బ్రహ్మపూర్, పలాస, విజయనగరం, దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, గూడూరు, రేణిగుంట, తిరుపతి, కాట్పాడి మీదుగా ప్రయాణిస్తాయి.

మత్తుతో చిత్తు...

నేడు ప్రపంచ మత్తు వ్యతిరేక దినోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : మత్తు జీవితాలను చిత్తు చేస్తోంది. సరదాగా మొదలైన అలవాటు మనిషి పతనానికి కారణనువుతోంది. ఒక్కోసారి సంఘ విద్రోహశక్తిగా కూడా మారుస్తోంది. యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుంది. చదువుకుంటున్న యువతను టార్గెట్ చేస్తూ వారి స్వలాభం కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడేలా కొన్ని ముఠాలు చేస్తున్నాయి. తొలినాళ్లలో మత్తును అశ్వదిస్తూ క్రమంగా అలవాటు పడిన తర్వాత దానికే బానిసలవుతున్నారు.

మద్యం, ఖైనీలు, గుట్కాలు, గిరిజన ప్రాంతాల నుంచి అక్రమంగా తరలించిన గంజాయితో పాటు పలు రకాల మాదకద్రవ్యాలు నగరంలో ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో విక్రయాలు చేస్తున్నారు. పోలీసులు, ఆహార భద్రత అధికారులు కట్టడి చేసేందుకు యత్నించినా వివిధ మార్గంలో మత్తు పదార్థాలు లభ్యమవుతున్నాయి.

మార్పు తీసుకురావడం అందరి బాధ్యత

మత్తు పదార్థాలకు బానిసలైన వారిలో మార్పు తీసుకురావడం మనందరి బాధ్యతగా గుర్తించాలి. ఈ దురలవాట్ల వల్ల ఊపిరితిత్తులు, కాలేయం, గొంతు, గుండె తదితరాలు పాడవుతున్నాయి. కేన్సర్‌కు కారణముపుతున్నాయి. కిడ్నీలు పాడైపోతున్నాయి. ఈ విషయాలపై వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలి. మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని ప్రారంభదశలో గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి మాన్పించే ప్రయత్నం చేస్తే వారిని మార్చవచ్చు.



ప్రశాంతి
పిహెచ్‌సి వైద్యాధికారి

అసాంఘిక శక్తులపై నిఘా

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు వార్తలు వస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. మద్యం, మత్తు పదార్థాలు తీసుకోవడం చట్ట ప్రకారం నేరం. గంజాయి, గుట్కా ఖైనీలను అమ్మేవారిపైనా, తాగేవారిపైనా కేసులు నమోదు చేస్తాం. రుషికొండ బీచ్, సిఎంపాలెం అఖరి బస్టాపు, వాంబేకాలనీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీల్లో నిఘాగట్టి నిఘా ఉంది. ముఖ్యంగా పరిసర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో కౌన్సెలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం.



వై.రామకృష్ణ, సిఐ
పిఎం.పాలెం



గుంతలతో ఉన్న తర్లువాడ రోడ్డు

అధ్వానంగా తర్లువాడ రోడ్డు

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని తర్లువాడ జంక్షన్ నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామంలో ఫార్మసీ కళాశాల ఉంది. కళాశాలకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పూర్వపు ఎమ్మెల్యే కర్రి సీతారాం చొరవతో గతంలో రోడ్డు ఏర్పాటుచేశారు. ఎన్నో ఏళ్లుగా దాన్ని పట్టించుకోకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అడుగడుగునా గుంతలయ్యాయి. ఈ రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానిక స్వచ్ఛంద సేవకుడు కోరాడ ఆదినారాయణ కోరారు.

26న మండల సమావేశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎండిఒ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సభ్యుల సాధారణ సమావేశం జరుగుతుందని ఎండిఒ డాక్టర్ వి.జానకి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వివిధ విభాగాల అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

27న రాయితీపై ఖరీఫ్ విత్తనాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎండిఒ కార్యాలయంవేదికగా రాయితీపై ఖరీఫ్ విత్తనాలను ఈ నెల 27న మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించనున్నట్లు వ్యవసాయ శాఖ భీమిలి డివిజన్ సహాయ సంచాలకులు బొడ్డేపల్లి విజయప్రసాద్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజక వర్గంలో ఉన్న స్థానిక ప్రజాప్రతినిధులను, రైతులను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

'బడికి పోతా'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -భీమునిపట్నం : బడికి పోతా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తహశీల్దార్ టి.గోవింద, ఎండిఒ, డాక్టర్ వి.జానకి, ఎంఇఒ 1, 2 ఎం.శివరాణి, జయప్రద ఉపాధ్యాయులను కోరారు. స్థానిక ఎండిఒ కార్యాలయంలో "నేను బడికి పోతా" కార్యక్రమం అమలుకు సంబంధించి మంగళవారం మండల కమిటీ ఏర్పాటైంది. కన్వీనర్‌గా ఎంఇఒ-1, చైర్మన్‌గా ఎండిఒ, సభ్యులుగా తహశీల్దార్, ఐసిడిఎస్ పిఒ శ్రీదేవి, సోషల్ వెల్ఫేర్ అధికారి జి.రమాదేవి, పాఠశాల సముదాయ కమిటీ చైర్మన్ పొట్నూరు మురళీ మోహనరావు, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ గంగాకుమారి నియమితులయ్యారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు మురళీ మోహనరావు

ఈ సందర్భంగా తహశీల్దార్ టి.గోవింద, ఎంఇఒ, ఎం.శివరాణి మాట్లాడుతూ, సచివాలయ సిబ్బంది సహకారంతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. పాఠశాల సముదాయ కమిటీ చైర్మన్ పి.మురళీమోహనరావు పలు సూచనలు చేశారు.

గ్రామాల్లో ఆర్ఎంపిలతోనే వైద్యసేవలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పద్మావతినాయుడు

ప్రజాశక్తి -ఆనందపురం : గ్రామాలలో అత్యవసర వైద్య సేవలు అందించేది ఆర్ఎంపీలేనని నర్సింగ్ హోమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పద్మావతినాయుడు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యాన పద్మావతి డయగ్నిస్టిక్స్ సహకారంతో మంగళవారం వైద్య విద్య అవగాహన సదస్సు నిర్వహించారు. పెద్దిపాలెం పారడైజ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి అతిథులుగా డాక్టర్ స్వామినాయుడు, నర్సింగ్ హోమ్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పద్మావతి నాయుడు, రాష్ట్ర ఫెడరేషన్ గౌరవ సలహాదారులు డాక్టర్ ఎన్ఎల్.రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మావతినాయుడు మాట్లాడుతూ, మీ పరిధి దాటే కేసులను పెద్ద ఆసుపత్రులకు పంపాలని ఆర్ఎంపిలకు సూచించారు. ఆర్ఎంపిల ద్వారా వచ్చే పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అతి తక్కువ ఖర్చుతో అందించడానికి ఒదుబాటులో ఉంటామన్నారు. డాక్టర్ ఎన్ఎల్.రావు మాట్లాడుతూ క్రమశిక్షణ కమిటీని ఏర్పాటుచేసి ఆర్ఎంపి కూడా పరిధి దాటకుండా వైద్యం చేసేందుకు అవసరమైన వైద్య విజ్ఞానాన్ని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవస్థాక అధ్యక్షుడు. జంగం జోషి, గౌరవ సలహాదారులు మమ్ముల తిరుపతిరావు, జోనల్ కార్యదర్శి ఎన్.సుగినేశ్వరి, కేన్సర్ ఫౌండేషన్ సెక్రెటరీ కోనా ప్రకాష్, స్థానిక సంఘ నాయకులు కెఎన్.రావు, సుధాకర్‌రెడ్డి, పచ్చిపులుసు కనకారావు, రామకోటేశ్వరరావు, అను, రాలి అప్పారావు, మంగ శివప్రసాద్, మీసాల నర్సింగరావు, మద్ది శంకర్రావు, మతికాన కన్నారావు, ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండల ఆర్ఎంపి వైద్యులు పాల్గొన్నారు.

బిఆర్‌టిఎస్ రోడ్డులో సైన్ బోర్డులు

ప్రజాశక్తి- సింహాచలం : శ్రీ లక్ష్మీనృసింహ స్వామి దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రెండవ ఘాట్ రోడ్డులో సైన్ బోర్డులు ఏర్పాటుచేశారు. భక్తులు అప్పన్న కొండపైకి వెళ్లడానికి, సింహాచలం వైపు వెళ్లడానికి మార్గాన్ని చూపుతూ సైన్ బోర్డులను ఏర్పాటుచేసినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు తెలిపారు.

నేరాలు ఘోరాలు

చోరీకి పాల్పడిన నలుగురు అరెస్టు - ఇద్దరు మైనర్లు

ప్రజాశక్తి -గాజువాక : నగర పరిధిలో పలుచోట్ల ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు క్రైమ్ డిసిపి ఎం.వెంకటరత్నం తెలిపారు. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నారని చెప్పారు. గాజువాకలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డిసిపి మాట్లాడుతూ, మాధవధారకు చెందిన సుంకర జగదీష్ (20), కంచరపాలేనికి చెందిన చిక్కల భరత్ (19), మరో ఇద్దరు మైనర్లు కలిసి నగరంలో పలుచోట్ల దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. శీలానగర్ అయ్యప్ప స్వామి టెంపుల్ వద్ద మంగళవారం వారిని పట్టుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 6 మోటర్ సైకిళ్లు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో క్రైమ్ అసిస్టెంట్ సిటీ పోలీస్ కమిషనర్ సిహెచ్ శ్యామలరావు, స్థానిక సిఐ పాల్గొన్నారు.

దంత సంరక్షణతో ఆరోగ్యం



దంత వైద్యులు శ్రీదివ్య

ప్రజాశక్తి -ఆనందపురం : దంతాలను సంరక్షణగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉండవచ్చునని శ్రీదివ్య మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ వైద్యులు డాక్టర్ కె.శ్రీదివ్య పేర్కొన్నారు. ఆనందపురం మండలం వేములవలస, బంటుపల్లి వారి కల్లాలలో రోడ్డులో శ్రీదివ్య మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్‌లో అధునాతమైన ఆర్‌విజి ఎక్స్ రే సౌకర్యం అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దంత సమస్యలకు సరైన చికిత్స అందించి, దంత సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రెండు పూటలా బ్రష్ చేసుకోవడం వల్ల పళ్లను శుభ్రంగా ఉంచుకోవచ్చని తెఇపారు. ఆరు నెలలకోసారి దంతాలను పరీక్షించుకోవాలని పేర్కొన్నారు. జంక్ ఫుడ్, స్వీట్స్, చాక్లెట్లు తగ్గించాలన్నారు. దంతాలు పరిశుభ్రంగా లేకపోతే పిప్పి పళ్లు, చిగుళ్ల నుంచి రక్తం, నోటి దుర్వాసన వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఖైని, గుట్కాల ద్వారా కేన్సర్ వస్తుందని, వీటికి దూరంగా ఉండాలని సూచించారు. తమ క్లినిక్‌లో రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్, ఇంప్లాంట్స్ అండ్ ఫిక్స్ దంతాల అమర్చుట, పిప్పి పళ్లకు ఫిల్లింగ్ చేయుట, చిగుళ్ల సమస్యలకు ప్రత్యేక చికిత్స ఎత్తు, వంకర పళ్లకు క్లిప్స్ వేయుట, పిల్లలకు ప్రత్యేక చికిత్స, స్మైల్ డిజైనింగ్, పెయిన్ లెస్ టూత్ ఎక్స్‌ట్రాక్షన్, పళ్ల సెట్ అమర్చుట తదితర సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళిక చట్టాన్ని అమలుచేయాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళిక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు భాగం గోపాలరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భీమిలిలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరుతో విదేశీ విద్యా పథకం ప్రవేశ పెట్టడాన్ని అభినందించారు. ఎస్‌సి కార్పొరేషన్‌ను పునరుద్ధరించి, సమృద్ధిగా నిధులు విడుదల చేయాలని, వైసిపి ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన దళితుల 27 పథకాలను ఈ ప్రభుత్వం పునరుద్ధరించాలని, జివిఎంసి నాలుగో వార్డు నేరెళ్లవలస, నిడిగట్టు, జిల్లాలోని ముదపాక ప్రాంతాల్లో ఏళ్ల తరబడి దళితుల సాగులో ఉన్న భూములను కాజేసిన పెత్తందారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, పెత్తందారుల అధీనంలో ఉన్న ఆయా భూములను స్వాధీనం చేసుకుని దళితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత విద్యార్థులకు కెజి నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందివ్వాలని కోరారు. ఈ సమావేశంలో దళిత సంఘం నాయకులు రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు

ప్రజాశక్తి -తగరపువలస : మాదక ద్రవ్యాల వాడకం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని సౌత్ జోన్ ఏసిపి సునీల్ అన్నారు. స్థానిక శ్రీ బాసర విద్యా సంస్థలో మంగళవారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని సూచించారు. సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో భీమిలి ఎస్ఐ జి.హరీష్, శ్రీ బాసర విద్యా సంస్థల చైర్మన్ పూడి రమేష్, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ సురేష్, భాస్కరరావు, వివిడి.రమేష్, జూనియర్, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.



రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

విత్తన శుద్ధిపై అవగాహన

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పొట్నూరు గ్రామంలో బీజామృతంతో విత్తనశుద్ధిపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. రైతులతోనే విత్తన శుద్ధి చేయించారు. ఇలా విత్తన శుద్ధి చేయడం వల్ల రైతులు వేసిన పంటలకు తెగులు రాకుండా ఉంటాయని ఎన్ఎఫ్ఎ ప్రతినిధి బాలమణి, ఐసిఆర్‌పి మీన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తోనంగి అప్పలనాయుడు, చందక వెంకట్రావు, కొంగరాన ఎర్నాయుడు, గొలగాని సత్యనారాయణ, జామి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గణబాబు

సమస్యల పరిష్కారంలో ముందుండాలి

ప్రజాశక్తి- గోపాలపట్నం : సమస్యల పరిష్కారంలో ముందుండాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు చెప్పారు. స్థానిక ధనుష్ కల్యాణ మండపంలో 89, 90 92 వార్డుల కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన విజయంలో కీలక భూమిక పోషించిన బూత్ స్థాయి నాయకులకు, యూనిట్ ఇన్‌ఛార్జిలకు, వార్డు నాయకులకు, జనసేన, బిజెపి నాయకులకు, మహిళలకు, కార్యకర్తలకు పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా నేరుగా గాని, ఆఫీసులో తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అంగా దుర్గప్రశాంతి, 89వ వార్డు టిడిపి కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో అభివృద్ధికి కృషి

- ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : వైసిపి ప్రభుత్వ హయాంలో పంచాయతీ స్థాయిలో జరిగిన అభివృద్ధిలో సర్పంచులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు అందించిన సహకారం మరువలేనిదని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలోని వైసిపి జెడ్‌పిటిసి, ఎంపిటిసిలతో సమావేశం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ కాలంలో ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల రూపు రేఖలు మార్చినట్లు తెలిపారు. విలేజ్ క్లినిక్‌లు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలతో ఇంటి ముంగిటకే ఆరోగ్య సేవలు అందించామన్నారు. రాబోయే కాలంలో కూడా అభివృద్ధి కార్యక్రమాల అమలులో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూనే సహకారం అందించాలని కోరారు. ప్రజలకు మేలు జరిగేలా మన పని విధానం ఉండాలన్నారు.

ఘనంగా పైడిమాంబ అమ్మవారి వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి రామకృష్ణాపురంలో ఉన్న పైడిమాంబ అమ్మవారి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారు జామునుంచే రామకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్.నగర్, పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, ఆరిలోవ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు చేశారు. అనంతరం వైభవంగా అమ్మవారి ఘటాలతో ఊరేగిస్తూ అనుపు కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, సత్యనారాయణ, టిడిపి వార్డు అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు అమ్మవారిని దర్శించుకున్నారు. డాక్టర్ అంబేద్కర్ గ్రామ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షులు వంకర బాబూరావు, గౌరవాధ్యక్షులు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు పట్టని రెవెన్యూ

ప్రజాశక్తి-పెందుర్తి : అధికారులు ఎన్నికల హడావిడిలో ఉన్న సమయంలో పెందుర్తి మండలంలోని పెందుర్తి, పురుషోత్తపురం, చినముసిడివాడ, వేపగుంట ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాల్లో విచ్చలవిడిగా ఆక్రమణలు జరిగాయి. గెడ్డలు, చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. స్థానిక విఆర్ఒలతో బేరసారాలు కుదుర్చుకొని ఆక్రమదారులు ధైర్యంగా నిర్మాణాలు చేపట్టారు. దీనిపై పలువురు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఎన్నికల హడావిడి అంటూ తప్పించుకున్నారు. అసలు ఆక్రమణల గురించే తనకు తెలియదని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చెబుతున్నారు. పెందుర్తి ప్రాంతంలో గజం ధర సుమారు రూ.30 వేలు పలుకుతోంది. దీంతో పలువురు అధికారులకు ఎంతోకొంత ముట్టజెప్పి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేస్తున్నారు. ఎలాగూ డబ్బులు అందుకుంటున్నారు కాబట్టి రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా 'ప్రభుత్వ భూమే కదా మీకెందుకురా' అని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. అవినీతి జరక్కూడదని గత ప్రభుత్వం సచివాలయాలను నిర్మించి ఒక విఆర్ఒను పెట్టినా అవినీతి ఎక్కడా ఆగలేదు. చెరువులు, గెడ్డలు కబ్జా అవడంతో వర్షం నీరు వెళ్లడానికి మార్గం లేకుండా పోయింది. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి దుస్థితి వస్తుందని పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పెందుర్తి మండలంలో ఆక్రమణపై తహశీల్దార్ బంగార్రాజును వివరణ కోరగా ఆక్రమణలు తమ దృష్టికి రాలేదని తెలిపారు. ఒకటి, రెండు ఫిర్యాదులొస్తే ఆ ఆక్రమణలను తొలగించామని చెప్పారు. ఆక్రమణల గురించి తమ దృష్టికి వస్తే పరిశీలిస్తామని తెలిపారు.

28 నుంచి గీతంలో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస్థ సంయుక్తంగా ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నాయని సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె ఘోష్ తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా పి.పప్పు, సదస్సు కన్వీనర్ డాక్టర్ వైఎల్‌పి.తోరణితో కలిసి మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వివిధ రకాల పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు, పట్టణాలు, రోజువారి జీవితంలో వినియోగించే ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఆసుపత్రి వ్యర్థాలను తిరిగి వినియోగించే రీసైకిలింగ్ పద్ధతులతో కొత్త ఆర్థిక వ్యవస్థను సృష్టించడాన్ని సర్క్యులర్ ఎకానమి అంటారని తెలిపారు. సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ -సర్క్యులర్ ఎకానమి, ఐపిఎల్ఎ గ్లోబల్ ఫోరమ్ -2024 పేరిట జరిగే ఈ సదస్సులో 60 దేశాల నుంచి 1000 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని, 400కు పైగా పరిశోధన పత్రాలను వివిధ రంగాల నిపుణులు సమర్పించనున్నారని తెలిపారు. సదస్సులో భాగంగా నవంబర్ 27వ తేదీన స్కూల్ చిల్డ్రన్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నామని, దీనికి దేశంలోని 600 పాఠశాల విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. సదస్సులో భాగంగా పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. గీతంతో కలిసి పలు వ్యర్థ పదార్థాల నిర్వహణ ప్రాజెక్టులను చేపడతామని ఆయన వెల్లడించారు. ఈ సదర్భంగా సదస్సు గోడ పత్రికను, ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు.



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శిథిలావస్థ భవనంలో అసాంఘిక కార్యకలాపాలు



అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న శిథిలావస్థ భవనం ఇదే..

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 61వ వార్డు పరిధి మల్కాపురం ఆర్‌కె.పురం ప్రాంతంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ రహదారిలో ఉన్న శిథిలావస్థ భవనంలో అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో ఎవరూ నివసించడంలేదు. దీంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. గంజాయి, మందుబాబుల కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. మందుబాబుల వల్ల ఎప్పుడు ఎవరికి ఎటువంటి ఆఘాయిత్యం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇదే రహదారిలో ఎన్నో హత్యలు కూడా జరిగాయి. ఇక్కడి చీకటి కార్యకలాపాలపై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రాహ్మణ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-సీతమ్మధార : బ్రాహ్మణ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా తెలుగుదేశం బ్రాహ్మణ సాధికార సమితి విశాఖ పార్లమెంట్ కన్వీనర్ వంగూరి గణేష్ సారథ్యంలోని బందం విష్ణుకుమార్‌రాజును సత్కరించింది. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలను అమలుచేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సాయిరామ్, అడ్వకేట్ చరణ్, రాజేష్, ఆదిభట్ల శ్రీనివాస్, భగవాన్, విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సులబ్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రైల్వేగ్రౌండ్ వద్ద చంద్రనగర్‌లో ఉన్న సులబ్ కాంప్లెక్స్‌కు మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సిపిఎం అక్కయ్యపాలెం జోన్ నాయకులు యుఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సులబ్ కాంప్లెక్స్ వద్ద మంగళవారం ఆందోళన చేశారు. చంద్రనగర్ రైల్వే గ్రౌండ్ ప్రజలు, తోపుడు బండ్ల కార్మికులు సులబ్ కాంప్లెక్స్‌ను ఉపయోగించుకునేవారని తెలిపారు. వాటర్ ట్యాంక్ లీకై పై భాగంలో ఉన్న రేకులు పూర్తిగా పాడైపోవడంతో నెల రోజుల నుంచి సులబ్ కాంప్లెక్స్‌ను పూర్తిగా మూసి వేశారని, దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే మరమ్మత్తులు చేపట్టి అందుబాటులోకి తేవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో అప్పలరాజు, రాంబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.



సులబ్ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-వేపగుంట : కొత్త విద్యుత్ లైన్ నిర్మాణ పనుల నిమిత్తం 33/11 కెవి సబ్‌స్టేషన్ పద్మనాభపురంలో, 11 కెవి బంటాకాలనీ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బంటాకాలనీ, అప్పలనరసయ్య కాలనీ, వెంకటసాయి నగర్ తదితర ప్రాంతాలకు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పల్లాకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-వేపగుంట : టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును చిన్ననాటి మిత్రుడు, జివిఎంసి పారిశుధ్య కార్మికుడు దమ్ము శ్రీనివాసరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పల్లా శ్రీనివాసరావు మరెన్నో ఉన్నతశిఖరాలు అధిరోహించాలని దమ్ము శ్రీనివాసరావు ఆకాంక్షించారు.

కలుషిత నీటితోనే డయేరియా

ప్రజాశక్తి -భీమునిపట్నం : కలుషిత నీరు తాగడం వల్లనే డయేరియా లాంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని జిల్లా పంచాయతీ అధికారి ఎంవిఎ.శ్రీనివాసరావు అన్నారు. 'డయేరియా నిర్మూలన'పై స్థానిక ఎండిఒ కార్యాలయంలో మంగళవారం వివిధ విభాగాల అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని రకాల పరీక్షలు జరిపిన మీదటనే తాగు నీరు సరఫరా చేయాలని సూచించారు. రక్షిత నీరు అందించ కుంటే అనేక రకాల అనారోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయని తెలిపారు. ఎండిఒ డాక్టర్ వి.జానకి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి గుండు అప్పలరాజు, ఐసిడిఎస్ పిఒ శ్రీదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు పాల్గొన్నారు.

ఖైదీల మానసిక స్థితిపై సమీక్ష

ప్రజాశక్తి - ఆరిలోవ : ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, వారి మానసిక స్థితిగతులపై మంగళవారం కేంద్రకారాగారంలో సమీక్ష నిర్వహించారు. జిల్లా మానసిక సమీక్ష బోర్డు చైర్మన్, రిటైర్డ్ జడ్జి బి.రామారావు, ప్రజ్వల ప్రతినిధి ఎ.సుచిత్ర, మానసిక వైద్య ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ కెవి.రామిరెడ్డి హాజరై సమీక్ష చేశారు. ఖైదీలకు నిరంతరం మానసిక వైద్యం అందుబాటులో ఉండాలంటే మానసిక వైద్య నిపుణుడు ఉండాలని వారు సూచించారు. ఈ సమావేశంలో కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్ కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, జైలు అధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దందాలపై చర్యకు డిమాండ్

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని మానం ఆంజనేయులు కాలనీలో నకిలీ దందాలపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పిల్లా వెంకటరావు డిమాండ్ చేశారు. వారి నివాసం వద్ద మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాలనీలో 25 ఏళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే మానం ఆంజనేయులు సహకారంతో ఏర్పాటైన కాలనీలో ప్రజల అవసరార్థం ఉంచి స్థలాలను ఒక వ్యక్తి అమ్ముతున్నారని తెలిపారు. ఎటువంటి అనుమతి లేకుండా పార్కు స్థలంలో శివాలయం నిర్మించారని వివరించారు. కాలనీలో ఉన్న స్థలాన్ని చదును చేసి 24 ప్లాట్లు, ఇందులో ఉన్న క్రాసు బిట్లు కలిపి అతను సొంత దర్బారుగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు.

రద్దు చేసిన పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలి

సిపిఎం ఆధ్వర్యాన జిల్లాలోని పలు ప్రాంతాల్లో ధర్నాలు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

ఆధునికీకరణ పేరుతో రద్దు చేసిన పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ధర్నాలు నిర్వహించారు.

అనకాపల్లి : విశాఖపట్నం నుండి విజయవాడ మీదగా వెళ్తున్న రైళ్లను తక్షణమే పునరుద్ధరించి సామాన్యులకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు, వలస కార్మికులు ప్రతి రోజూ వేలాది మంది ఈ రైళ్లలో ప్రయాణిస్తున్నారని తెలిపారు. వారికి అందుబాటులో వుండే రైల్వే సర్వీసులను రద్దు చేయడం వలన తీవ్రమైన ఆర్థిక భారంతో పాటు గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలు ప్రయాణించే జనరల్ బోగీలను గతంలో కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని, తరువాత కాలంలో సాధారణమైన వారికి అందుబాటులో వుండే స్లీపర్ బోగీల సంఖ్యను కూడా తగ్గించి వేసి సామాన్యుల ప్రయాణ సౌకర్యాలను దూరం చేసిందని విమర్శించారు. తాజాగా ఆధునికీకరణ పేరుతో విశాఖ నుండి విజయవాడ వెళ్ళే పాసింజర్ రైళ్లతో పాటు సింహాద్రి, రత్నాచల్, ఉదయ్, మచిలీపట్నం, గుంటూరు రాయగడ ఎక్స్‌ప్రెస్‌లను తరచూ నిలిపివేయడంతో రోజుకు 10 వేల మంది ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఆధునికీకరణ పనులు చేపట్టాలి గాని, ప్రత్యామ్నాయ మార్గాలు చూడకుండా ఇలా రైళ్లను నిలుపుదల చేయడమంటే ఉద్దేశ్యపూర్వకంగానే ప్రజలను రైలు ప్రయాణం నుంచి దూరం చేయడానికి కుట్ర చేస్తున్నట్లు అర్థమవుతుందని పేర్కొన్నారు. రైలు ప్రయాణం పట్ల ప్రజలకు ఆసక్తి తగ్గించి క్రమంగా రైళ్లను ప్రైవేటీకరించాలన్న కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాల్లో భాగంగానే రైళ్ల రాకపోకలను రద్దు చేసినట్లు తెలుస్తోందన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రమైన తరువాత నిత్యం ప్రయాణికుల రాకపోకలు పెరిగాయని, అనకాపల్లిలో ఎల్‌టిటి, వందేభారత్‌తో పాటు పలు రైళ్లకు హాల్ట్ లేకపోవడంతో వీరంతా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైళ్లు, రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారన్నారు. రైళ్లలో టాయిలెట్స్ మరీ అధ్వానంగా, దుర్గంధభరితంగా వుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సాధారణ ప్రయాణికుల సాదక బాధలను అర్థం చేసుకొని రద్దు చేసిన పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలని, విశాఖ నుండి బయలుదేరే ఎల్‌టిటి, వందేభారత్ రైళ్లకు అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, పెంటకోట శ్రీనివాసరావు, తెలయ్య బాబు, నాయనబాబు, రాజు, చలపతి, నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



యలమంచిలి రైల్వే స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

యలమంచిలి : రైళ్లను పునరుద్దరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో యలమంచిలి రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం యలమంచిలి మండల కన్వీనర్ కర్రి అప్పారావు, అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ రైలు ఛార్జీలు తక్కువ కావడంతో సామాన్యులు రైళ్లల్లో ప్రయాణం సాగిస్తుంటారని, వారికి రైలు ప్రయాణం దూరం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో కె.సోమునాయుడు, సిహెచ్.శివాజీ, రాము, రామకృష్ణ, రంగారావు, రాంబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ, అప్పలరాజు, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.


పరవాడలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

పరవాడ : రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ సిపిఎం పరవాడ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పరవాడ సినిమా హాల్ జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పి.మాణిక్యం మాట్లాడుతూ పేద, మధ్య తరగతివారికి అందుబాటులో వుండే రైల్వే సర్వీసులను రద్దు చేయడం వలన వారిపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.తులసి రాజు, కె.నాయుడుబాబు, జి అప్పారావు, డి జగన్నాథరావు, పి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ రాయవరం : నర్సీపట్నం రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పేరుతో నిలుపుదల చేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరించాలని, విశాఖ, విజయవాడ మధ్య రద్దు చేసిన పాసింజర్, ఎక్స్‌ప్రెస్‌లను యథావిధిగా కొనసాగించాని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు యమ్ అప్పలరాజు నర్సీపట్నం రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, విశాఖ నుండి ముంబాయి వెళ్ళి వచ్చే ఎల్‌టిటి, విశాఖపట్నం నుండి లింగంపల్లి వెళ్లి వచ్చు జన్మభూమి ట్రైన్‌కు నర్సీపట్నం రైల్వేస్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని కోరారు. అనంతరం రైల్వేస్టేషన్ మాస్టారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణ, సిపిఎం నాయకులు ఎం.రాజేష్, కె.ప్రసాద్,కె.కాశీరావు, ఎం.శ్రీను, ఎం.రమణ, ఎం.భైరాగిరాజు,ఎం.బాపూజీ పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని చౌడువాడ ఆర్‌బికె వద్ద రైతులకు వరి విత్తనాలను గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. చౌడువాడ పంచాయతీ పరిధిలో మల్లంపాలెం, గరుగుబిల్లి, పాచిలవానిపాలెం గ్రామాలకు చెందిన రైతులకు వివిధ రకాల చెందిన 339 బస్తాల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రామానుజన్, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం వరకు భానుడు.. తరువాత వరుణుడు

- మండే ఎండ, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు

- వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి- కశింకోట, బుచ్చయ్యపేట

జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం వరకు భానుడి ప్రతాపంతో మండే ఎండ, ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడగా, మధ్యాహ్నం 3 గంటల తరువాత వరుణుడు రాకతో ఉపశమనం పొందారు. కశింకోట, బుచ్చయ్యపేట మండలాల్లో మంగళవారం ఉదయం 10 గంటలకే ఎండ విపరీతంగా కాసింది. దానికి ఉక్కపోత తోడు కావడంతో జనం విలవిలలాడిపోయారు. దీంతో వాహనదారులు ప్రయాణాలను సైతం విరమించుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే కశింకోట మండలం తాళ్ళపాలెం జంక్షన్ ఎండ కారణంగా నిర్మానుష్యంగా మారింది. బుచ్చయ్యపేట మండలంలోని కసింకోట-బంగారు మెట్ట రోడ్డు, నర్సీపట్నం రోడ్డు, రావికమతం -తట్టబంద రోడ్డులు వాహనదారులు లేక ఖాళీగా దర్శనమిచ్చాయి. అయితే మధ్యాహ్నం 3 గంటల సమయంలో వాతావరణ ఒక్కసారిగా చల్లబడి కశింకోట మండలంలో భారీ వర్షం, బుచ్చయ్యపేట మండలంలో చిరుజల్లులు కురిశాయి. దీంతో ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఇబ్బందిపడ్డ ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

యలమంచిలిలో 21.6 మిల్లీమీటర్ల వర్షం

యలమంచిలి : నాలుగు రోజులుగా విపరీతంగా కాస్తున్న ఎండలకు విసుగుపోయిన జనాలకు మంగళవారం మధ్యాహ్నం 3 నుండి 4 గంటల మధ్య కురిసిన వర్షం కాస్త ఊరటనిచ్చింది. మంగళవారం 21.6 మిల్లీమీటర్లు వర్షం కురిసినట్లు స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో రికార్డయింది. ఈ మధ్య కాలంలో ప్రజలు ఎండల వేడి, ఉక్కపోతకు తల్లడిల్లారు. ఉపశమనం కోసం ఎదురు చూశారు. ఖరీఫ్ రైతులు దిగాలు పడే తరుణంలో కురిసిన వర్షం కాస్త ఊరటనిచ్చింది. వరినారు మడులు తయారీ పనుల్లో రైతులు తలమునకలై ఉన్నారు. విత్తనాలు జల్లడానికి అనువైన కాలం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో కురిసిన వర్షం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఎదజల్లడానికి ఎదురు చూసే వరి రైతులకు ఈ వర్షం అనుకూలంగా భావిస్తున్నారు.


కశింకోట మండలం తాళ్లపాలెం కురుస్తున్న వర్షం


వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

బడి బస్సుల కోసం ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - యలమంచిలి

బడి బస్సులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే బడి బస్సులు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ యలమంచిలి డివిజన్ కార్యదర్శి కేశవ ఆధ్వర్యాన విద్యార్థులు మంగళవారం స్థానిక తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేశవ మాట్లాడుతూ యలమంచిలిలో ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య 5వేలు దాటి ఉంటుందని, వీరంతా వారి వారి ప్రాంతాల నుంచి రావడానికి అవసరమైన బస్సుల సంఖ్య లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు పాస్ కౌంటరు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. దిమిలి ప్రాంతం నుండి వచ్చే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బస్సులు ఏర్పాటు చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.బాలాజీ, సురేష్, శ్రీను, రోహిణి, పూజిత, కల్పన, రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు నడుమ పంచాయతీ పాలకవర్గ సమావేశం

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది మేజర్ పంచాయతీ పాలకవర్గ సమావేశం పోలీసు బందోబస్తు నడుమ మంగళవారం జరిగింది. సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి, ఉపసర్పంచ్ దాడి సూర్య నాగేశ్వరరావు గత సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ నుండి జనసేనలో చేరారు. 14 మంది వార్డు మెంబర్లలో 12 మంది వైసీపీలోనే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడుతుందన్న ముందస్తు సమాచారంతో కొత్తకోట సిఐ అప్పలనాయుడు, స్థానిక ఎస్సై డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వైసీపీకి చెందిన జడ్పిటిసి దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ కూడా హాజరయ్యారు. ఎజెండా మేరకు సమావేశం ప్రశాంతంగా ముగిసింది.

వైసిపి కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని కొత్తూరు నర్సింగరావుపేటలో నాటి శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ కాపు సామాజిక భవనానికి కేటాయించిన స్థలాన్ని వైసిపి ప్రభుత్వం వైసిపి కార్యాలయానికి కేటాయించి ఆఫీసు నిర్మాణం చేయడంపై మంగళవారం కాపు సామాజిక నాయకులు, కార్యకర్తలు వైసిపి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీలాబాబు మాట్లాడుతూ తక్షణమే అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జీవీఎంసీ జోనల్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారిపై శాఖా పరంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సిరిసపల్లి సన్యాసిరావు, మాజీ సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, సిహెచ్ దుర్గాప్రసాద్, జనసేన నాయకులు ఈత గోపి, జాజిమొగ్గల అప్పలరాజు, గొల్లవిల్లి రాజు, కరెడ్ల కుమార్, కసిరెడ్డి అప్పలకొండ, చూచుకొండ రమణ, కసిరెడ్డి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వైసిపి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే ఊరుకోం

మునగపాకలో అడ్డుకున్న రైతులు, సిఐటియు, రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి- మునగపాక

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ హెచ్చరించారు. స్థానిక తంపర మూల ప్రాంతంలో రైతు కమతాల వద్ద మంగళవారం విద్యుత్ సిబ్బంది వ్యవసాయం మోటార్లకు మీటర్లు బిగించడాన్ని స్థానిక రైతులు, ఏపీ రైతు సంఘం, గ్రామ రైతు సంఘం, సిఐటియు నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే ఊరుకునేది లేదని, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందజేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గుట్టు చప్పుడు కాకుండా మీటర్లు బిగిస్తున్న విద్యుత్ సిబ్బందికి రైతులు నుండి అనుకోని పరిణామం ఎదురు కావడంతో విస్తుపోయారు. రైతులు తిరుగుబాటుతో చేసేది లేక అధికారులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా అప్పారావు, బ్రహ్మాజీ మాట్లాడుతూ రైతుల పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్న తరుణంలో వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయమన్నారు. దీని వల్ల రైతులు ఉచిత విద్యుత్ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్నామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం తక్షణమే స్మార్ట్ మీటర్లను ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ రైతు సంఘం నాయకులు విల్లూరి నూక నరసింహారావు, తంపరమూల రైతు సంఘం నాయకులు పెంటకోట ఆదిశివ, కోయిలాడ రాము, శరగడం అచ్చయ్య నాయుడు, దాడి గోవింద, పెంటకోట వెంకట సూర్యనారాయణ, నాగసూరి, విల్లూరి అప్పారావు, దాడి వీరునాయుడు, ఆడారి గణేష్, కర్రి కోటి, శరగడం రమణబాబు తదితరులు పాల్గొన్నారు.


మీటర్ల బిగింపు వద్ద నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు


స్థానిక నాయకులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్

తాడిలో జోనల్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని తాడి గ్రామంలో జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ వి.అయ్యప్పనాయుడు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ పివి ముకుందరావు మంగళవారం పర్యటించారు. ఇటీవల నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాల మేరకు సురక్షితమైన మంచినీటిని తాడి ప్రజలకు అందించడానికి అధికారులు పరిశీలించారు. రక్షిత మంచినీటి ట్యాంక్ నుండి శాంపిల్స్ సేకరించారు. సురక్షితమైన మంచినీరు గ్రామ ప్రజలకు అందజేస్తామని, అవసరమైతే బయటి తీసుకొస్తామని జోనల్ కమిషనర్ తెలిపారు. తాడి గ్రామాన్ని తరలించే లోపు సురక్షమైన నీరు, మెడికల్ క్యాంపులు, కాలుష్యం అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి మాజీ సభ్యులు మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోమటి సూరిబాబు, కె.ఫైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మినీ వాటర్ ట్యాంకులకు మరమ్మతులు చేపట్టండి

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలో పాడైపోయిన వాటర్ ట్యాంకులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం జివిఎంసి 82వ వార్డు పరిధి విజయరామరాజుపేట శ్రీకృష్ణ మందిరం వద్ద ఉన్న మినీ వాటర్ ట్యాంక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ వాటర్ ట్యాంకు సంవత్సరం నుంచి పని చేయడం లేదని, దీనికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. దీనికి స్పందించిన వాటర్ వర్క్స్ ఏఈ నాగేశ్వరరావు జీవీఎంసీ సిబ్బందితో వాటర్ ట్యాంకు వద్దకు వచ్చి పరిశీలించి మరమ్మతులు చేపడతామని తెలిపారు. చుట్టుపక్కల పాడైపోయిన పైపులను పునరుద్ధరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు, ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిన్ని యాదవ్, ముగడా అప్పారావు, నంబారు నూకరాజు, బొట్ట మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా పరదేశమ్మ పండగ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ పంచాయతీ శివారు శంభువానిపాలెం గ్రామంలో పరదేశమ్మ అమ్మవారి పసుపు కుంకుమల పండుగ మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి గుడికి వెళ్లటానికి రహదారి సౌకర్యం లేకపోయినా ఎమ్మెల్యే పొలాల గట్లపై నుంచి నడిచి వెళ్లి దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మొదటి సారి తమ గ్రామానికి రావడంతో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చల్లా నానాజీ ఆధ్వర్యంలో గ్రామస్తులు బండారుకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరకాన సూర్యనారాయణ, మండల నాయకులు, పోతల పాత్రునాయుడు, ఆవుగడ్డ కోటిపల్లి నాయుడు, కొమర బాబూరావు, గొర్లె దేవుళ్ళు, కిల్లి గోవింద, చల్ల తాతయ్యలు, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకున్న స్థానిక ఎమ్మెల్యే బండారు

రైతులకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జిల్లా రైతాంగానికి వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలను మంగళవారం తెలియజేసింది. చెరకులో పేనుబంక పురుగు ఆశిస్తే డైమిథోయేట్ రెండు మిల్లీ లీటర్లు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. 120 రోజులు వయసుగల చెరకు తోట మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగవేయాలి. పంట ఎదుగుదల బట్టి మొవ్వులో 8 ఆకులు విడిచిపెట్టి జడ చుట్టూ వేసుకుంటే గాలులకు పడిపోకుండా ఉంటుంది. వర్షాధార చెరకు నాటుకునే ముందు ముచ్చలను 10 శాతం సున్నపు నీటిలో నానబెట్టి నాటుకోవాలి. మొక్కజొన్న వేసుకునే రైతులు అధిక దిగుబడి నిచ్చే డిహెచ్ఎం రకాలు 117, 119, 121 ఎకరాకు 8 కిలోల చొప్పున 60X20 సెంటీమీటర్ల దూరంలో నాటుకోవాలి. మొక్కజొన్నను విత్తే ముందు థోర్డెంజా 6 మిల్లీ లీటర్లు కిలో విత్తనానికి చొప్పున విత్తన శుద్ధి చేసుకోవాలి. చోడి వేసుకునే రైతులు ఇంద్రావతి, వేగావతి, శ్రీచైతన్య వంటి రకాలను ఎకరాకు రెండున్నర కిలోల చొప్పున ఐదు సెంట్ల నారుమడి వేసుకోవాలి. కంది సాగు చేసుకునే రైతులు ఎల్ఆర్‌జి 52, 133, 105, టిఆర్‌జి 59 వంటి రకాలు విత్తన శుద్ధి చేసుకుని వేసుకోవాలి. పెసరలో అధిక దిగుబడి నిచ్చే ఐపిఎం 2-14 ఎకరాకు ఆరేడు కిలోలు వేసుకోవాలి. మినుములో పియు 31 రకం, వేరుశనగలో నిత్య హరిత ఎకరాకు 60 కిలోలు, కదిరి లేపాక్షి ఎకరాకు 35 కిలోలు వేసుకోవాలి. నువ్వు పంటలో రసం పీల్చే పురుగు అరికట్టేందుకు డైమిథోయేట్ రెండు మిల్లీ లీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. కూరగాయల పంటలకు రైతులు నారుమడి ఎత్తుగా వేసుకుని మ్యాంకోజెబ్ రెండు గ్రాములు లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి నారుమడి తడిసేలా పిచికారీ చేయాలి. 90 కిలోల పశువుల గెత్తం, 10 కిలోల వేప పిండి, రెండు కిలోల ట్రైకోడెర్మా విరిడిని పది రోజులపాటు నీళ్లు చల్లి నీడలో ఉంచి ప్రధాన పొలంలో చల్లుకుంటే తెగులు ఉధృతి తగ్గుతుంది.

పారిశుధ్య నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో మంచినీటి బోర్లు, రక్షిత మంచినీటి పథకాల నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించారు. డ్రై పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరీష్, ఈవోపీఆర్డి విజయలక్ష్మి, పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఎమ్‌ఎల్‌హెచ్‌పిలు, పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- వడ్డాది : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎంఎస్వీకే బాలాజీ మంగళవారం బుచ్చయ్యపేట మండలం వడ్డాది ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక వైద్యాధికారి శకుంతలతో ఆసుపత్రి పనితీరుపై సమీక్షించారు. రికార్డులు పరిశీలించారు. స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహణపై ఆసుపత్రి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తామని, ఇందులో భాగంగా ఐదేళ్ల లోపు పిల్లలకు ఓఆర్ఎస్, అవసరమైన వారికి జింక్ సిరప్ ఉచితంగా సరఫరా చేస్తామని చెప్పారు. ఇంటింటి సర్వే చేస్తున్నామన్నారు. అనకాపల్లి జిల్లాలో డయేరియా కేసులు ఎక్కడా నమోదు కాలేదని, సిబ్బంది, మందుల కొరత లేదని వెల్లడించారు. సంబంధిత అధికారుల ద్వారా గ్రామాల్లో పారిశుధ్యం, నిర్దేశిత సమయంలో వాటర్ ట్యాంక్ క్లోరినేషన్ చేయిస్తున్నామని చెప్పారు.


రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ బాలాజీ

నెల రోజులుగా పని చేయని తాగునీటి పథకం

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని తెనుగుపూడి పంచాయితీ పరిధి విస్సారాపు వీధిలో జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ.30 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్ నెల రోజులకు పైబడి పని చేయడం లేదు. దీంతో ఆ గ్రామవాసులు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే పంచాయతీ పాలకులకు, అధికారులకు తెలియజేసినప్పటికీ కనీసం స్పందన లేదనిగ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కె.చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఇప్పటివరకు ఈ సమస్య తమ దృష్టికి రాలేదని, రెండు రోజుల్లో మరమ్మతు పనులు చేపట్టి యుద్ధ ప్రాతిపదికన తాగునీటిని అందజేస్తామని చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కరించకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలుగు యువత మాడుగుల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొట్యాడ సామలనాయుడు, టిడిపి కార్యకర్తలు మహేష్, ఎర్నాయుడు, నర్సిబాబు విలేకరులకు తెలిపారు.


పని చేయని ట్యాంకు ఇదే..

గంజాయి నిర్మూలనకు 100 రోజుల ప్రణాళిక

జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి

గంజాయి అక్రమ రవాణా, ఇతర డ్రగ్స్ నివారణకు 100 రోజుల ప్రత్యేక కార్యచరణ అమలు చేయనున్నట్లు జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ తెలిపారు. ఆదేశించారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం నేర సమీక్ష సమావేశం ఎస్పీ మురళీకృష్ణ అధ్యక్షతన జరిగింది. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, 174 సీఆర్‌పీసీ కేసులు, గంజాయి, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారుల నుండి తెలుసుకున్నారు. త్వరితగతిన దర్యాప్తు చేయడానికి పలు సూచనలు చేశారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గంజాయి రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. గంజాయి రవాణా జరిగే మార్గాలను గుర్తించి వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను అరెస్టులు చేయడం జరుగుతుందని తెలిపారు. నేరస్తులు అక్రమంగా సంపాదించిన ఆస్తులను చట్టప్రకారం స్వాధీనపరచుకోవడం గురించి కూడా చర్చించారు. జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ర్యాలీలు, అవగాహన సదస్సుల చేపట్టాలని ఆదేశించారు. జూన్ 29న జరగబోవు జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కాంపౌండబుల్ కేసులను స్టేషన్ హౌస్ ఆఫీసర్స్ తమ సిబ్బంది, కోర్ట్ మానిటరింగ్ సెల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సమన్వయం ద్వారా ఎక్కువ కేసులు డిస్పోజ్ చేయడంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, పి.సత్యనారాయణ రావు, డిఎస్పిలు ఎస్.అప్పలరాజు, కె.వి.సత్యనారాయణ, ఎం.ఉపేంద్రబాబు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, గణేష్, సతీష్, సంజీవరావు, ఎస్సైలు రామారావు, రఘువర్మ, జిల్లా సిఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



నెలవారీ నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

వేతన వెతలు !

- 17 నెలలుగా జీతాలకు నోచుకోని ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు
- కుటుంబపోషణ, ఇతర అవసరాలకు ఆర్థిక ఇబ్బందులు
- ఆందోళనకు సన్నద్ధం

ప్రజాశక్తి -పాడేరు: వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ నేచురల్ కమ్యూనిటీ ఫార్మింగ్(ప్రకృతి వ్యవసాయ విభాగం), రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) విభాగంలో పనిచేస్తున్న వివిధ కేడర్లలోని ఉద్యోగులు గత 17 నెలలుగా వేతనాలు అందని పరిస్థితి ఉంది.. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై తోడ్పాటు అందించే విధులను నిర్వర్తిస్తున్న వీరికి 2023 ఫిబ్రవరి నుంచి ప్రభుత్వం వేతనాలు మంజూరు చేయలేదు. వ్యవసాయంలో సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమాలు, పెట్టుబడి లేని వ్యవసాయానికి తోడ్పాటు సేంద్రీయ ఎరువుల తయారీ విధానం వంటి ఎన్నో కార్యక్రమాలను నిరంతరం నిర్వర్తిస్తూ రైతులకు వెన్ను దన్నుగా నిలిచి సేవలందిస్తున్న వీరికి, నెలల తరబడి వేతనాలు అందక పోవడం వల్ల ఆర్థిక ఇక్కట్లను ఎదుర్కొంటూ ఆందోళన బాట పట్టారు రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం ఉద్యోగులు తమ వేతనాల మంజూరు కోసం ఆందోళనలు చేస్తున్నారు అల్లూరి జిల్లాలో పాడేరు, రంపచోడవరం డివిజన్లోని 22 మండలాల్లో సుమారు 850 మంది ప్రకృతి వ్యవసాయం ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరంతా వివిధ కేడర్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు (ఐసిఆర్‌పి)గా యూనిట్ ఇన్‌ఛార్జిలుగా, మండల ఇన్‌ఛార్జిలుగా, నేషనల్ ఫార్మింగ్ యానిమేటర్స్ గా పనిచేస్తున్నారు.క్యాడర్‌ను బట్టి ఒక్కొక్కరికి 17 నెలలకు గాను రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకు



ఆందోళన చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

వేతన బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. తమ వేతన బకాయిల మంజూరు కోసం సిఐటియు ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వంతో చర్చలు జరిపి సంబంధిత శాఖ మంత్రికి, అధికారులకు మరోసారి విజ్ఞప్తులు చేసి, అనంతరం సమస్య పరిష్కారం కాకుంటే ఆందోళన చేపట్టేందుకు అన్ని మండలాల ఉద్యోగులు సమాయత్తమవు తున్నారు. ఇందులో భాగంగానే అల్లూరి జిల్లా కేంద్రంలో ఉన్న డిపిఎం కార్యాలయానికి రెండు రోజుల క్రితం ఉద్యోగులు వెళ్లి తాళం వేశారు.

చారిత్రక స్థలాలను పరిరక్షించండి

- ఆక్రమణలపై చర్యలకు ఆర్‌డిఒకు పడాల వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన బ్రిటిష్ సేనానులు కవర్డు, హైటర్ సమాధుల స్థలం ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు కోరారు. మంగళవారం ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర పురావస్తు శాఖకు చెందిన, రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న ఈ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ స్థలాన్ని కొంతమంది ఆక్రమిస్తున్నారన్నారు. గ్రీవెన్స్‌లో ఫిర్యాదుకు ఆర్‌డిఒ చొరవతీసుకుని, మున్సిపల్ అధికారులకు ఆదేశించి, కొన్ని ఆక్రమణలు తొలగించారని, ఇపుడు మళ్లీ ఆక్రమణలకు యత్నిస్తున్నారన్నారు. స్థలం దురాక్రమణ కాకుండా కంచె, ప్రహరీ వేసేందుకు అనుమతులు ఇస్తే, తమ సంఘం నిధులతో ప్రహరీ నిర్మిస్తామన్నారు. అలాగే ఆక్రమణలకు గురికాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

వాలంటీర్లను పునర్నియమించాలి

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ :వాలంటీర్లను తిరిగి నియమించాలని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు అన్నారు. మంగళవారం మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం, నాయకులు ఇచ్చిన భరోసాతో అనేకమంది గ్రామ వాలంటీర్లు రాజీనామాలు చేశారన్నారు. ఇపుడు ఆ ప్రభుత్వం ఓటమి చెందడంతో వైసిపి నాయకులు నిర్వాకం వల్ల వాలంటీర్లు ఉపాధి కోల్పోయారన్నారు. వాలంటీర్లు కొంతమంది చేసిన తప్పు వలన మిగతా వారందరినీ తొలగించడం మంచిపద్ధతి కాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికైనా పెద్ద మనసు చేసుకొని, వాలంటీర్లను తిరిగి నియమించి, కొనసాగించాలని కోరారు. అలాగే వైసిపినాయకులు అహంకారం వల్ల కొంతమంది వాలంటీర్లు రెచ్చిపోయి ఇష్టా రాజ్యంగా వ్యవహరించిన తీరు కూడా సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రజలకు సేవ చేసేందుకు వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని, నేతల అండతో వ్యవస్థకు చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించరాదని వాలంటీర్లకు హితవు పలికారు.

జ్వరపీడిత గిరి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- రోలుగుంట: గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాతావరణం మారి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ఇప్పటికే అర్ల గ్రామంలో జ్వరాలు విజృంభించాయన్నారు. గెమ్మల కృష్ణ, నూకాలమ్మ, చినకొండ, కిమిడి అచ్చియ్యమ్మ తదితరులు రోగాల బారిన పడి మంచాన పట్టారన్నారు. లోసింగి, గుర్రాలబైలు తదితర గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

విద్యుత్ స్తంభం నేలమట్టం

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని అమలాపురం గ్రామంలో మంగళవారం విద్యుత్ స్తంభం నేలమట్టమైంది. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం సాయంత్రం కొద్దిపాటి వర్షానికి విద్యుత్ స్తంభం కుప్పకూలింది. ఆ సమయంలో దగ్గరలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

గ్రామంలో ఉన్న పాత విద్యుత్ స్తంభాలు తొలగించి ,వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానిక నాయకుడు ఎరిపిల్లి సత్తిబాబు డిమాండ్ చేశాడు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. చిన దొడ్డిగల్లు గ్రామంలో గంటసేపు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది.

28న కోదండరామస్వామి కల్యాణం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని జానకిరాంపురం గ్రామంలో ఈ నెల 28న కోదండ రామస్వామి తృతీయ వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు నాయుడు, దివాకర్, ఆనంద్, శ్రీను, గంగునాయుడు, శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 27న గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 28న ఉదయం 9 గంటలకు స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. కల్యాణంలో పాల్గొనే దంపతులు ముందుగా గోత్ర నామాలతో పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

పెద తీనార్లకు ట్రాక్టర్ మంజూరు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని పెద తీనార్ల పంచాయతీకి ట్రాక్టర్ మంజూరైనట్లు సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు నాగేశ్వరరావు తెలిపారు .మంగళవారం ట్రాక్టర్‌ను ప్రారంభించారు. గ్రామంలో చెత్త తరలించేందుకు దీన్ని మంజూరు చేశారన్నారు. గ్రామంలో పారిశుధ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తా మన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తాతారావు ,పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై హోంమంత్రికి వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘ నేతలు హోం మంత్రి అనితకు వినతిపత్రం అందజేశారు .నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్‌లోని మంత్రి అనితను ఆమె స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జిఒ 117 ను రద్దు చేయాలని, ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన మైదానప్రాంత ఉపాధ్యాయులను తిరిగి మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలలో బోధన మాతృభాషలో ఉండే విధంగా చూడాలని, ఉన్నత పాఠశాలలో తెలుగు , ఇంగ్లీష్ మీడియంలో తరగతులు బోధన జరిగే విధంగా చూడాలని ,12వ పిఆర్‌సికి సంబంధించి ఐఆర్ ప్రకటించాలని ,ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని, డిఎస్‌సి 2008 ఎంపిటిఎస్ ఉపాధ్యాయులను హైకోర్టు ఉత్తర్వులు మేరకు రెగ్యులర్ చేయాలని ,ఉపాధ్యాయులకు భారమైన యాప్స్‌ను



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

తొలగించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు, కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు గోపీనాథ్, ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వేశ్వరరావు, నక్కపల్లి మండల శాఖ అధ్యక్షులు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి శివాజీ, జిల్లా ఉపాధ్యక్షులు డివి సన్యాసిరావు, ఎస్ రాయవరం మండలం అధ్యక్షులు వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సిహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆలయాల ట్రస్ట్ బోర్డులకు త్వరలో నోటిఫికేషన్

- దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి

ప్రజాశక్తి - నక్కపల్లి : అనకాపల్లి జిల్లాలో ఎండోమెంట్స్ పరిధిలో వున్న ఆలయాల ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు త్వరలో నోటిఫికేషన్ వస్తుందనిదేవదాయ, ధర్మాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కేఎల్ సుధారాణి తెలిపారు గత పాలక మండళ్లు రద్దయినట్టేనన్నారు. చాలా మంది స్వచ్ఛందంగానే తమ పదవులకు కూడా రాజీనామా చేశారన్నారు.

మంగళవారం నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ, . తమ పరిధిలో జిల్లాలో మూడు 6ఎ ఆలయాలు, 6బీ ఆలయాలు 25 ఉన్నాయన్నారు . కమిషనర్ నుంచి ఆదేశాలు రాగానే ఆలయాల్లో ట్రస్ట్ బోర్డు ల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఆలయాల్లో భక్తుల సంఖ్య గతంతో పోల్చుకుంటే బాగా పెరిగిందన్నారు. ఆలయాలకు వచ్చే భక్తులందరికీ కనీస సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఎండోమెంట్స్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రాజు, పాయకరావుపేట పాండురంగస్వామి దేవస్థానం ఇఒనరిశే వెంకటాద్రి పాల్గొన్నారు.

ఫీ'జులుం' అరికట్టాలని ధర్నా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ప్రభుత్వ నిబంధన పాటించకుండా ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పెదబొడ్డేపల్లి భాష్యం పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పాఠశాలలో అమ్ముతున్న పాఠ్య పుస్తకాలను బయటకు తీసుకొచ్చారు. అనంతరం ఎంఇఒ నాగేంద్ర వచ్చి బుక్స్‌ను సీజ్ చేయిశారు. అనంతరం నర్సీపట్నంలో విద్యాంజలి పాఠశాలను కూడా తనిఖీ చేసి జిల్లా విద్యాశాఖ అధికారులకు నివేదిక పంపిస్తామన్నారు.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధన పాటించకుండా ఇష్టానుసారంగా ఫీజు వసూలు చేస్తున్నాయన్నారు. పాఠశాలల్లో యూనిఫామ్‌లు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాబ్జి, జీ.ఫణీంద్ర కుమార్, ఏఐవైఎఫ్ నాయకులు రాధాకృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు జగదీష్, రవి, తాతాజీ, సింహాద్రి పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఇబి ఎస్ఐ రహీం

ప్రజాశక్తి- గొలుగొండ: మండలంలోని కొత్త మల్లంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భగా ఎస్ఇబి ఎస్సై రహీం మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి తీసుకోవడం, కలిగి ఉండడం, రవాణా వల్ల భవిష్యత్ నాశనం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఈబి సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో సీతకండి గ్రామ శివారు మెయిన్ రోడ్డులో సోమవారం రాత్రి నాలుగు కేజీల గంజాయితో ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ బి.కృష్ణారావు తెలిపారు. రాత్రి 7 గంటల సమయంలో తనిఖీలు చేపట్టగా, చింతపల్లి నుంచి నర్సీపట్నం వైపు బైక్ వస్తుండగా గోనే సంచిలో ఉన్న గంజాయిని గుర్తించామన్నారు. నిందితుల ద్విచక్ర వాహనంతోపాటు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

78 కిలోల గంజాయి పట్టివేత

రోలుగుంట : మండలంలో పెదపేట దార గంగాలమ్మ గుడి వెనుక మూటలతో 78 కేజీల గంజాయిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఇద్దరు వ్యక్తులు సిద్ధంగా ఉండగా ఎస్ఐ సురేష్, సిబ్బంది పట్టుకున్నారని కొత్తకోట సిఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ఈ కేసులో ఎంకె.పట్నం గ్రామానికి చెందిన సరమండ ఈశ్వరరావు, బిబి.పట్నానికి చెందిన మొయ్య జ్యోతిబాబును వారి వద్ద ఉన్న ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

బుడ్డడపాడులో వైద్యశిబిరం ఏర్పాటు

◆ 'ప్రజాశక్తి' కథనానికి వైద్యఆరోగ్యశాఖ అధికారుల స్పందన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో పాత మల్లంపేట శివారు బుడ్డడపాడు గ్రామంలో గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 'బుడ్డడపాడులో జ్వరాలు' శీర్షిక పేరిట ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు స్పందించిన వైద్య సిబ్బంది గ్రామంలో శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో జ్వరాలు బారిన పడిన బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. అనంతరం ఇంటి వద్ద ఉన్న జ్వరపీడితులను వైద్యాధికారుల బృందం సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు వ్యాధులపై అవగాహన కలిగించడానికి సదస్సు నిర్వహించారు.

సదస్సులో వైద్యాధికారి శ్యామ్ మాట్లాడుతూ, గొలుగొండ పిహెచ్‌సిలో సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని, వైద్యసేవలకు ప్రైవేట్ క్లినిక్లకు వెళ్లకుండా ప్రభుత్వ వైద్యశాలకు రావాలన్నారు. పేద ప్రజల కోసమే ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా అన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని, వాటిని



ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై ఆరా తీస్తున్న డాక్టర్‌శ్యామ్



వైద్యశిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ప్రతి ఒక్కరూ కాసి వడపోసిన నీరునే తాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి ఆనంద్, వైద్యాధికారులు ప్రశాంతి, కీర్తి, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిసి రమణబాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



రూ.20వేలు విలువైన బోధన సామగ్రి అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మండల ప్రాథమిక పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులకు రూ 20 వేల విలువైన 650 నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, ఇతర సామాగ్రిని విద్యార్థులందరికీ ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి -1 సి హెచ్.తలుపులు, కొత్తకోట ఎస్ఐ లక్ష్మణ రావు మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఇలాంటి సేవా కార్యక్రమం నిర్వహించడం హర్షనీయమని అభినందించారు. వీటిని విద్యార్థులంతా వినియోగించుకుని, బాగా చదువుకుని మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చక్కని చదువుతోపాటు క్రీడలు, ఇతరత్రా రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలని కోరారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు వై.గణేష్ కె.సతీష్ మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదువుకున్న తామంతా నేడు మంచి స్థాయిలో ఉన్నామని, ఇపుడున్న వారుకూడా బాగా చదువుకుని, గ్రామానికి, వీకుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో విద్యా, సాహితీవేత్తలు కె.లక్ష్మణరావు జి.రామారావు, గ్రామ యువత వెంకట రమణ, అంజి, జగదీష్, అనిల్, శివ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు



రెయిన్‌కోట్లు అందజేస్తున్న సర్పంచ్, ఇఒపిఆర్‌డి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఏఎల్ పురం మేజర్ పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు మంగళవారం స్థానిక సర్పంచ్ లోచల సుజాత రెయిన్ కోట్లును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంకితభావంతో పనిచేసే పారిశుధ్య కార్మికులకు వర్షాకాలంలో విధులకు ఆటంకం కాకుండా ఉపయోగపడతాయనే ఉద్దేశంతో రెయిన్ కోట్లును అందజేస్తున్నామన్నారు. ఇఒపిఆర్‌డి రమణి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులందరూ బాధ్యతగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీను, రఘురాం, సచివాలయ కార్యదర్శి రాజేష్, ఎంపిటిసి పడాల మాధవ్, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి హామీ



హోంమంత్రి అనితకు వినతిపత్రం ఇస్తున్న విఆర్‌ఎలు

ప్రజాశక్తి- ఎస్ రాయవరం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోవరాజు హోంమంత్రి అనితకు వినతిపత్రం అందించారు. మంగళవారం నక్కపల్లి వచ్చిన హోంమంత్రి అనితను ఆమె స్వగృహంలో కలిసిన విఆర్ఎల సంఘం నేతలు తమ సమస్యలను విన్నవించారు. దీనిపై మంత్రి అనిత స్పందిస్తూ, సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు విఆర్ఎల సంఘం నేతలు తెలిపారు.

వైద్యసేవలపై టాస్క్‌ఫోర్స్ టీం ఆరా



కొత్తకోట హెల్త్ క్లినిక్ సందర్శనలో టాస్క్‌ఫోర్స్ టీం

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోట పిహెచ్‌సి పరిధిలో కొత్తకోట సచివాలయం-1 హెల్త్ క్లినిక్‌ను మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు డిపిఎంఒ డాక్టర్ లూసి కార్డియా, ఎస్ఒ రామచంద్రరావు, డిపిఒ జగదీష్, డిపిహెచ్ఎన్ ఓ నాగమణి సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తకోట హెల్త్ క్లినిక్‌లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గర్భిణులకు, కిశోర్ బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత వలన జరిగే నష్టాలను టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు వివరించారు. అలాగే పాఠశాలకు వెళ్ళి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. హెల్త్‌సెంటర్ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండాలని, వచ్చిన రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు....

1నుంచి స్టాప్ డయేరియా విజయవంతం చేయాలి

జులై 1 నుంచి నిర్వహించనున్న స్టాప్ డయేరియా ప్రోగ్రామ్‌ను విజయవంతం చేయాలని డాక్టర్ లూసి కార్డియా, యస్ ఓ రామచంద్రరావు కోరారు. ఈ సందర్భంగా యాక్షన్ ప్లాన్ పరిశీలించారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా గ్రామాలలో సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ రామారావు, హెచ్ఎస్ రమణ, హెచ్‌వి ఎర్రమ్మ, హెల్త్ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

28న అయ్యన్న స్వాగతానికి భారీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న లాలం శ్రీరంగస్వామి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : శాసనసభా స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ నెల 28న నియోజకవర్గానికి వస్తున్న నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడును స్వాగతించేందుకు భారీ సన్నాహాలు చేస్తున్నట్లు నర్సీపట్నం మండల టిడిపి అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి తెలిపారు. మాకవరపాలెం మండలం శెట్టిపాలెం గ్రామానికి మధ్యాహ్నం 2 గంటలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి భారీ వాహన ర్యాలీతో నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియం చేరుకొని, అక్కడ భారీ బహిరంగ నిర్వహిస్తారన్నారు. కావున కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, కూటమి శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మైదాన ప్రాంత గిరిజనులకూ

ట్రైబల్ సెల్ సేవలు అందించాలి



మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -గొలుగొండ : మైదాన ప్రాంత గిరిజనులకూ ట్రైబల్ సెల్ సేవలు అందించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు అన్నారు. మండలంలో పాత మల్లంపేట శివారు బుడ్డడపాడు గ్రామంలో సిపిఎం నాయకుల బృందం మంగళవారం పర్యటించింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, మండలంలోని గిరిజన గ్రామాలలో జ్వరాలు ప్రబలినా, వారికి సరైన వైద్యం అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో ఆర్థిక భారమైనా ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారన్నారు. కె అశ్విని అనే ఐదేళ్ల చిన్నారి మలేరియా టైఫాయిడ్ కిడ్నీ సమస్యతో కెజిహెచ్‌లో ఆదివారం రాత్రి మరణించింది దన్నారు. రోగం వచ్చిన వెంటనే గ్రామాల్లో వ్యాధి నిర్ధారణ గానీ, అవసరమైన వైద్యంగానీ అందకపోవడం వల్లే ఇలా గిరిజనులు మృత్యువాత పడుతు న్నా రన్నారు. కేజీహెచ్, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలలో ట్రైబల్ సెల్ సేవలు మైదాన ప్రాంత గిరిజనులకు కల్పించడం లేదని, దీంతో వారంతా సరైన వైద్యానికి నోచుకోక అన్యాయానికి గురవుతున్నారన్నారు. గిరిజనులే అయినప్పటికీ, వారికి ట్రైబల్ సెల్ సేవలను అందించడంతో అధికారులు ఎందుకు మొండిచేయి చూపుతున్నారో అంతుపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆసుపత్రిలో మైదాన ప్రాంతం గిరిజనానికి కూడా ట్రైబల్ సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎపిడమిక్ సీజన్‌లో గిరిజన గ్రామాల్లో జనం జ్వరాలతో అల్లాడి పోతున్నారని, గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహించి, జ్వరాల అదుపునకు చర్యలు చేపట్టడంతోపాటు జ్వరమరణాలకు ఆస్కారం లేకుండా చూడాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, సభ్యులు టి. రాజుబాబు, టి. చిన్నబాబు పాల్గొన్నారు.